# నోట్ల రద్దుతో టెక్స్‌టైల్ అమ్మకాలు ఢమాల్

**హైదరాబాద్, డిసెంబర్ 19:** పెద్దనోట్లను రద్దుచేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో టెక్స్‌టైల్ రంగంపై తీవ్రస్థాయిలో ప్రభావం పడింది. గడిచిన నెల రోజుల్లో దేశవ్యాప్తంగా దుస్తుల విక్రయాలు 50 శాతం మేర పడిపోయాయని బాంబేడైయింగ్ సీఈవో నగేష్ రాజన్న తెలిపారు. మరో మూడు నెలలపాటు ఈ ప్రభావం కనిపించనున్నదని, వచ్చే ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం నాటికి కోలుకునే అవకాశం ఉందని ఆయన వెల్లడించారు. ఈ నిర్ణయం టెక్స్‌టైల్ రంగంపై ఆధారపడుతున్నవారు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. ఇదేసమయంలో డిజిటల్ లావాదేవీలు పుంజుకోవడం కొసమెరుపు అని ఆయన వ్యాఖ్యానించారు. 2020–21 ఆర్థిక సంవత్సరం నాటికి సంస్థ రూ.1,000 కోట్ల టర్నోవర్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు నగేష్ తెలిపారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో టర్నోవర్ రూ.305 కోట్లుగా నమోదైంది. కంపెనీ మొత్తం విక్రయాల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వాటా 15 శాతానికి పైగా ఉండటంతో ఈ రెండు రాష్ట్రాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. అలాగే ఆన్‌లైన్ సేవల రంగంలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవడానికి వచ్చే రెండు నెలల్లో డిజిటల్ ప్లాట్‌ఫామ్ సేవలను కూడా అందుబాటులోకి తీసుకరానున్నట్లు తెలిపారు.